

# ఫారిన్ వెళ్ళాల(న్)oడీ

## - వసుంధర



*మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.*

(గత సంచిక తరువాయి)

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

## చివరి విడత: మలి సంధడి (21)

*స్నేహానంద లహరి*

దేవ్‌దార్‌ని చూడగానే ముందు నోటమాట రాలేదు.

అతడు మాత్రం వెంటనే, ‘‘గ్యుటెన్ మోర్గెన్’’ అంటూ పలకరించి, ల్యూనబర్గ్ రోజుల్ని గుర్తుకి తెచ్చాడు.

జర్మన్ క్లాసులకి వెడుతున్న ఆ రోజుల్లో, అలా పలకరించుకోవడం భాషాశిక్షణలో భాగం.

‘‘మోర్గెన్’’ అన్నాను.

దేవ్‌దార్ వెంటనే, ‘‘తొందరగా తెమిలిపోయాను. ఆగలేక ముందే వచ్చేసాను’’ అన్నాడు హిందీలో.

ఆ మాటల్లో సంజాయిషీని పులుముకున్న ఆత్మీయత నన్ను కదిలించింది.

‘‘చాలా మంచి పని చేశావ్ – మేమూ అనుకుంటున్నాం – నువ్వు ముందుగా వస్తే బాగుణ్ణని’’ అన్నాను.

మామూలుగా ఐతే, అలాగనడం మర్యాద.

ఆంగ్లంలో గెస్ట్ అనే పదానికి తెలుగు సేతగా వాడే పదం అతిథి.

అతిథి అంటే చెప్పా చెయ్యకుండా వచ్చేవాడని అర్థం. గెస్ట్ అన్న పదానికి వచ్చేవాడని మాత్రమే అర్థం. అతిథికి సరైన ఆంగ్లపదం సర్‌ప్రయిజ్ గెస్ట్ అనుకుంటాను.

అంటే మనం చెప్పాచెయ్యకుండా వచ్చేవారిని ‘అతిథి’ అన్న పదంతో మర్యాదపూర్వకంగా గౌరవిస్తాం.

ఎవరైనా చెప్పకుండా మనింటికొస్తే, ఒకోసారి, ‘ఈ సమయంలో వచ్చాడేంట్రా బాబూ!’ అనిపించేటంత ఇబ్బందికరంగా ఉంటుంది.

ఐనా సరే, ‘‘అరే, ఇప్పుడే నీ గురించి అనుకుంటున్నాం. భలే వచ్చావే’’ అని ఆప్యాయతని నటించడం మనకి రివాజు.

‘మనమెవరింటికైనా అలా అతిథిగా వెళ్ళినప్పుడు, అవతలివారు ఆప్యాయతని ఒలకబోస్తే, అది వాళ్ల మర్యాద అని గ్రహించాలి తప్ప – అలా చెప్పా పెట్టకుండా వెళ్లడాన్ని అలవాటుగా పాటించకూడదు’ అని మా తాతగారు చాలాసార్లు చెప్పారు. ఐతే చెప్పా పెట్టకుండా ఎవరైనా మనింటికొచ్చారంటే, వాళ్లు కావాలని అలా చేసి ఉండరనీ, ఏదో అవసరం అనుకోకుండా వచ్చి ఉంటుందనీ – అర్థం చేసుకుని – వాళ్లకి మర్యాద ఇవ్వడం మన సంప్రదాయమని కూడా ఆయన చెప్పారు.

అందుకే మన సంప్రదాయంలో అతిథి, ఆతిథ్యం అనే పదాలకి చాలా విలువుంది.

‘‘చాలా మంచి పని చేశావ్ – మేమూ అనుకుంటున్నాం – నువ్వు ముందుగా వస్తే బాగుణ్ణని’’ అనడంలో నేను ఆప్యాయతని నటించానా అన్న అనుమానం రేగి, మనసు చివుక్కుమంది.

ఇంతకీ దేవ్‌దార్ అతిథి కాదు. ముందుగానే చెప్పి వచ్చిన గెస్ట్.

ఇందాకా శ్రీమతితో, ‘‘బోరు చూపినవాడే దారి చూపిస్తాడు’’ అన్నాను కదా – దారి కాస్త తొందరగా చూపించేశాడని అనుకోవాలంతే!

దేవ్‌దార్‌తో కరచాలనం చేసి లోపలకు తీసుకెళ్లాను కానీ మనసు నిండా గాబరా.

అతడికోసం ఇప్పుడు పూరీలు వెయ్యాలి.

ఒక్కణ్ణీ ఇక్కడ కూర్చోబెట్టి అక్కడ మేమిద్దరం పూరీలు వెయ్యాలా? లేక మొత్తం పని భారమంతా శ్రీమతికి వదిలెయ్యాలా?

ఇండియాలో ఐతే ఏమో, ఇక్కడ పూరీలాంటి టిఫిను చేసేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి.

స్టవ్‌మీదున్న బూరెలమూకుడులోంచి చుక్క నూనె కూడా బయటకు చిందకూడదు.

ఎందుకంటే చెక్క నేల. దానిమీద డిజైన్లున్న ఓ తివాచీ.

ఆ రెండింటికీ మామూలు నూనే పడదు. ఇక వేడి వేడి నూనైతే, అంతే సంగతులు!

పూరీలు వెయ్యడం అయ్యేక, వంటింట్లో ఏంజరిగిందో తెలుసుకుందుకు నేలమీద చిన్న క్లూ కూడా వదలకూడదు.

ఇక గదిని నింపిన వేడి నూనె ఘుమఘుమలు పోవడానికి ఎగ్జాస్ట్ ఫాన్‌ని సమర్థవంతంగా వాడాలి.

అలా పూరీలు వెయ్యడం ఓ కత్తిమీద సాము.

అంతకు ఐదారేళ్ల క్రితం నా సీనియర్ కొలీగ్ కాంతారావు కూడా భార్యాసమేతంగా బెర్లిన్లోనే ఉన్నాడు. వంటింట్లో చేపలు వేయించినప్పుడూ, ఇంగువ నూనె కాచినప్పుడూ – తనూ, తన భార్యా పడిన ఇబ్బందుల్ని తరచుగా చెబుతుండేవాడాయన. వాటినప్పుడు కథలా విని వినోదించానే తప్ప, అలాంటి పరిస్థితి మాకూ వస్తుందని ఊహించలేదు.

ఎటొచ్చీ కాంతారావు దంపతులుండే ఇల్లు జర్మన్నుది. ఇప్పుడు నేనుంటున్నది పోలండ్‌కు చెందిన మహిళది.

ఒలోముచ్‌కీ పోలండ్ సంప్రదాయాలకి ప్రతినిధి అనుకోను. అన్ని దేశాల్లోనూ అన్ని రకాలవారూ ఉంటారు. అలా ఈమె స్వతహాగా కొంచెం ఎడ్డి. తన పనికి అడ్డు రాకపోతే – కిచెను, బాత్రూముల గురించి అంతగా పట్టించుకోదు. అందువల్ల ఒలోముచ్‌కీతో కొంత ఫరవాలేదు కానీ, మరీ పూరీలు చేసినట్లు క్లూలు వదిలినా ఫరవాలేదనుకునేటంత కాదు.

పలు రకాల ఆలోచనలతో దేవ్‌దార్‌ని లోపలికి తీసుకెళ్లాను.

అప్పటికి శ్రీమతి పూరీ సరంజామా అంతా వంటగదికి తరలించి వచ్చింది.

''గుడ్ మార్నింగ్ సిస్టర్'' అన్నాడు దేవ్‌దార్ శ్రీమతికి చేతులు జోడిస్తూ.

భారతీయుల్లో ప్రత్యేకత అది. సిస్టర్ అన్న పదాన్ని ఉచ్చరించినప్పుడు – తోడబుట్టినవారేనన్న అనుభూతి అప్రయత్నంగా కలుగుతుంది.

శ్రీమతి మందహాసం చేసి ప్రతి నమస్కారం చేసింది.

శ్రీమతికి అటూ ఇటూ వెనుక నిలబడి తనని కుతూహలంగా చూస్తున్న పిల్లలిద్దర్నీ ముద్దుగా చూస్తూ, ''హాయ్ క్యూటీ, స్వీటీ'' అన్నాడు దేవ్‌దార్.

వాళ్లకి మేమిచ్చిన ట్రైనింగ్ ఉందిగా – వాళ్లు ముందుకొచ్చి, ''నమస్తే అంకుల్'' అన్నారు ఏకకంఠంతో.

దేవ్‌దార్ ఇద్దరికీ చెరో చాక్లెట్టూ చేతిలో పెట్టాడు.

వాళ్లు నాకేసి చూశారు. ''తీసుకోండి'' అన్నాను.

వాళ్లు తీసుకున్నారు. వెంటనే శ్రీమతికి ఇచ్చేశారు.

దేవ్‌దార్ ఆశ్చర్యపోయాడు, ''చాక్లెట్లిస్తే పిల్లలు వెంటనే పక్కకెళ్లిపోయి తినేస్తారు. కొందరైతే మన మొహంమీదే తినేస్తారు. ఇంకా – తినడానికి పెద్దల అనుమతి తీసుకునే పిల్లల్ని చూశాను. అందాకా జేబులో దాచుకునే పిల్లల్ని చూశాను. ఇలా తల్లికి ఇచ్చేసే వాళ్లని చూడ్డం ఇదే ప్రథమం. మీ ఇంట్లో పెద్దలే కాదు, పిల్లలు కూడా చాలా ఎక్కువగా క్రమశిక్షణ పాటిస్తారన్నమాట!'' అన్నాడు మెప్పుకోలుగా.

నొచ్చుకుంటారని ఇచ్చినవాళ్లకి చెప్పం కానీ, మా వాళ్లకి అప్పట్లో క్యాడ్‌బరీస్ టైపు మిల్క్ చాక్లెట్లు నచ్చక, తినేవారు కాదు. దేవ్‌దార్ మెచ్చుకుంటే – మనసులో నవ్వుకుని పైకి సంతోషం నటిస్తూ, ''థాంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్'' అన్నాను.

''కూర్చోండి'' అంది శ్రీమతి మేమిద్దరం ఇంకా నిలబడే ఉండడం చూసి.

ఒకటే గది. ఓ మూలగా అటువైపు మంచం.

మేము నిలబడ్డచోట తలుపుకి దగ్గర్లో మామూలు కంటే కాస్త ఎక్కువ ఎత్తున్న టీపాయ్. అదే మాకు డైనింగ్ టేబుల్ కూడా. దాని చుట్టూ నాలుగు కుర్చీలు.

దేవ్‌దార్ ఆ కుర్చీల్ని చూస్తూనే, ''జర్మనీలో ఇంతవరకూ ఎవరింట్లోనూ ఇలాంటి కుర్చీలు చూడలేదు. రాజుల కాలాన్ని గుర్తు చేస్తున్నాయి. మీ ఇంటామె ఇచ్చిందనుకుంటాను. గుడ్ టేస్ట్'' అని మెచ్చుకున్నాడు.

రాజుల కాలం అనగానే ఇక్ష్వాకుల కాలమనే ధ్వనించింది నాకు. ఎందుకంటే ఆ గదిలో ఉన్న బల్ల, కుర్చీలు, మంచం – అన్నీ కూడా పాత కాలానివి మాత్రమే కాదు, బాగా పాతబడినవి కూడా!

అవి ఇంటామె అభిరుచికి కాదు, లోభితనానికి ప్రతీకలు.

దేవ్‌దార్‌కి సూటిగా మాట్లాడ్డం అలవాటే కానీ, వ్యంగ్యోక్తులతో ఎదుటివారిని నొప్పించడం నచ్చదు. అందుకని అతడి మాటని మెప్పుకోలుగానే గ్రహించి, ''గుడ్ టేస్టే కాదు, మా ఇంటామె ఒలోముచ్‌కీది కైండ్ హార్ట్ కూడా! జర్మనీలో, అదీ బెర్లిన్లో , అదీ ఫామిలీకి – ఇంత చౌకగా ఇల్లు ఇచ్చేవారుంటారంటావా?'' అని గొంతు తగ్గించి కాస్త నెమ్మదిగానే ఒలోముచ్‌కీని పొగిడాను.

''అదేమిటీ – ఉన్నట్లుండి అంత నెమ్మదిగా మాట్లాడేవ్!'' అన్నాడు దేవ్‌దార్ ఆశ్చర్యంగా.

''తన మాట ఆ కైండ్ హార్ట్‌కి వినిపిస్తే – రాని భాషని కూడా అర్థం చేసుకుని, క్షణాలమీద అద్దె పెంచేస్తుందని భయం'' అంది శ్రీమతి. .

దేవ్‌దార్‌కి ఆ మాట అర్థమై, జీర్ణం కావడానికి కొంచెం సేపు పట్టింది. అప్పుడతడు నవ్వి, కుర్చీలో కూర్చున్నాడు. నేనూ కూర్చుని శ్రీమతినీ కూర్చోమన్నాను.

''భాయిసాబ్‌కి కాఫీ తెస్తాను'' అని శ్రీమతి తలుపు తెరుచుకుని కిచెన్లోకి వెళ్లింది.

పిల్లలిద్దరూ ఆమెననుసరించారు.

దేవ్‌దార్ ఉత్తరాదివాడైనా, టీ కంటే కాఫీనే ఎక్కువిష్టపడతాడని శ్రీమతికి చెప్పాను. అదామెకి గుర్తుంది.

వాళ్లు వెళ్లేక మేమిద్దరం మొహమొహాలు చూసుకున్నాం.

అతడికి బిడియం. నాకు స్టార్టింగ్ ట్రబుల్.

మా ఇద్దరిమధ్యా మాటలు ఊపందుకోవడానికి కాసేపు పట్టేలా ఉందని శ్రీమతి కనిపెట్టేసింది. అందుకే ఇద్దర్నీ వదిలేసింది.

ఆమె కాఫీ తెచ్చేలోగా, నేనేదో ఓ టాపిక్కుని ఊతంగా తీసుకుని – ముందుకెళ్లాలి.

నాకు బుర్ర బ్లాంక్ ఐపోయింది. అందుకని, వేరే టాపిక్ తోచక, ఒలోముచ్‌కీనే ఊతంగా తీసుకున్నాను.

ఒలోముచ్‌కీ దినచర్య చెప్పాను. అతడు విన్నాడు.

అతడామె వయసు, ఉద్యోగం అడిగాడు. చెప్పాను.

ఇద్దరికీ ఏమాత్రం ఆసక్తి లేకపోయినా – ఆమెపై అత్యంత ఆసక్తి చూపిస్తూ మాట్లాడుకుంటుంటే – నాకో అనుమానమొచ్చింది.

ఒలోముచ్‌కీ గురించి మాట్లాడుకుందుకే అతగాడిక్కడికొచ్చినట్లు నేను భావిస్తున్నానా అని.

దేవ్‌దార్ ఆమె తలిదండ్రుల గురించీ, బాల్యం గురించీ, చదివిన స్కూలు గురించీ అడిగాడు.

ఆమె పోలిష్ వనిత అని తెలుసు కానీ, ఇవన్నీ నాకు తెలియవు. దేవ్‌దార్ మా ఇంటికొచ్చి ఇవన్నీ అడిగే ఇలాంటి పరిస్థితి వస్తుందని ముందుగా తెలిస్తే, ఆమె గురించి మరింత సమాచారం సేకరించేవాణ్ణేమో!

దేవ్‌దార్‌కి కూడా ఆ సమాచారంపై అంత ఆసక్తి ఉందనుకోను. నేనో టాపిక్ తీసుకొస్తే, అందులోంచి బయటపడ్డానికి మొహమాటపడి అదే కంటిన్యూ చేస్తున్నాడు కాబోలు.

పోనీ మరో టాపిక్‌లోకి వెళ్లొచ్చు. కానీ నాకది తట్టే పరిస్థితి లేదు.

కొత్త టాపిక్ దానంతటదే రావాలి. అంతవరకూ ఒలోముచ్‌కీ చరిత్ర ప్రవాహంలో కొట్టుకుపోక తప్పదు.

ఆ సమయంలో కాఫీతో వచ్చింది శ్రీమతి.

ఆమె ఒకే కప్పు తీసుకురావడం గమనించి, ''మరి రావుకో'' అని నాలిక్కరుచుకుని, ''రావు కాఫీ, టీలు తాగడు కదూ! గ్యోతే ఇన్‌స్టిట్యూట్‌లో వింతగా అనుకునేవాళ్లం'' అని కప్పు అందుకున్నాడు.

శ్రీమతి మందహాసం చేసి వెళ్లిపోయింది. పిల్లలిద్దర్నీ కిచెన్లో వదిలి వచ్చిందిగా – ఆదీ తన కంగారు.

శ్రీమతి పుణ్యమా అని మా టాపిక్ గ్యోతే ఇన్‌స్టిట్యూట్‌కి మారింది.

అతడు కాఫీ తాగుతుంటే, గ్యోతే ఇన్‌స్టిట్యూటులో జర్మన్ నేర్పిన టీచర్ల గురించి మాట్లాడుకున్నాం. అతడు కాఫీ కప్పు కింద పెడుతూ, ''మా అమ్మ వంటెంతో బాగా చేస్తుంది. పొరపాటున కూడా రుచి చూడదు. తనంటుందీ – రుచి చూడకుండా చేస్తేనే వంటకు అసలైన రుచి వస్తుందని. భాభీజీ కాఫీ అద్భుతంగా ఉండడానికి అదే కారణమేమో!'' అన్నాడు.

దేవ్‌దార్ సాహితీప్రియుడు. స్వతహాగా కవి. మరాఠీలో కవితలు వ్రాస్తాడు.

''మీరు తాగకపోయినా, మీ ఇంట్లో కాఫీ చాలా బాగుంది'' అన్న మాటని ఎంత బాగా చెప్పాడు!

''ఈ మాట నేరుగా మీ భాభీజీకే చెప్పు. ఎక్కువ సంతోషిస్తుంది'' అన్నాను.

అతడు వెంటనే, ''ల్యూనబర్గ్‌లో గ్యోతే ఇన్‌స్టిట్యూటు వివరాలు కూడా భాభీజీ వచ్చేక మాట్లాడుకుందాం. నీ నోట విన్న విశేషాలు, నా నోట వింటే అదో నావెల్టీ'' అన్నాడు దేవ్‌దార్.

అతడితో కలిసి ల్యూనబర్గ్‌లో నైట్‌క్లబ్బుకి వెళ్లడం గుర్తొచ్చి కొంచెం తడబడ్డాను. ఆ విశేషాలు మాట్లాడతాడా?

ఐతే దేవ్‌దార్ ఆ టైపు కాదని నాకు తెలుసు.

నేనింకా ఏదో అనేలోగానే, ''మీ పిల్లలు చాలా క్యూట్‌గా ఉన్నారు. నాకు పిల్లలంటే చాలా ఇష్టం. కానీ ఎవరైనా చూస్తుండగా మాట్లాడ్డానికి కాస్త మొహమాటం. నాకు మీవాళ్లతో మాట్లాడాలనుంది. కాసేపు వాళ్లని నా దగ్గర వదిలేస్తావా?'' అన్నాడు.

అతడి సమస్య నాకర్థమైంది.

నాక్కూడా పిల్లలంటే చాలా ఇష్టం. ఎవరూ లేకపోతే వాళ్లతో కలిసిపోయి వాళ్లలో ఒకడిగా మసలగలను. పెద్దవాళ్లెవరైనా పక్కనుంటే మాత్రం పిల్లలకంటే ఎక్కువగా నేనే బిగుసుకుపోతాను.

అవతల వంటగదిలో శ్రీమతి పూరీలు వేసే పనిలో ఉంది. మనిషి సాయముంటే తనకి సుఖం. అందులోనూ పిల్లలిద్దరూ పక్కనున్నప్పుడు నేనుండడం మరింత అవసరం.

నేను ఆఫీసుకెళ్లినప్పుడు పూరీలు వేస్తే – పిల్లల్ని బెడ్రూంలో వదిలేస్తుంది. వాళ్లు బొమ్మలతో ఆడుకుంటుండగా కిచెన్లో వంట పని చూసుకుంటుంది.

దేవ్‌దార్ ఉండడంవల్ల ఇప్పుడలా చెయ్యడానికి లేకపోయింది.

పిల్లల్ని తీసుకొచ్చి దేవ్‌దార్ దగ్గర వదిలేస్తే, నేను కిచెన్లో శ్రీమతికి వంట సాయం కూడా చెయ్యొచ్చు. తనకు తెలియకుండానే దేవ్‌దార్ నాకా వీలు కల్పించాడు.

ఐతే నాకో అనుమానం కూడా రాకపోలేదు.

శ్రీమతి ఒక్కత్తీ కిచెన్లో ఉందన్న భావంతో, కావాలనే అతడు నాకా వీలు కల్పిస్తున్నాడా?

''వద్దులే దేవ్‌దార్! మా పిల్లలకి కొత్త ఎక్కువ. వాళ్లు నీతో మాట్లాడరు. నువ్వు మాట్లాడుతుంటే, ఏడ్పు మొహం పెడతారు. నీకు కొంత బోరుగా, కొంత ఎంబరాసింగ్‌గా ఉంటుంది'' అన్నాను. దేవ్‌దార్ నవ్వి, ''చాలామంది తలిదండ్రులకి వాళ్ల పిల్లల వ్యక్తిత్వాల్ని అంచనా వెయ్యడం తెలియదు. అందుక్కారణం – వాళ్లు పిల్లల్ని పిల్లలన్న దృష్టితో చూడ్డం. నువ్వు వాళ్లని నా దగ్గర వదిలి చూడు. నా మాటలో నిజం నీక్కూడా తెలుస్తుంది. ఎటొచ్చీ కాసేపు మీవాళ్ల్ని నాదగ్గర వదిలే ధైర్యముండాలి'' అన్నాడు.

నేను కూడా నవ్వి, ''నువ్వంత మనసు పడుతున్నప్పుడు నేనెందుకు కాదనాలి? పైగా భాభీజీ నీకోసం పూరీలు ప్లాన్ చేసింది. నువ్వు వీళ్లని ఎంగేజ్ చేస్తే, నేను తనకి సాయం చేస్తాను'' అన్నాను.

దేవ్‌దార్ మొహం అదోలా పెట్టి, ''నువ్వు చెప్పిందాంట్లో నాకు రెండు విషయాలు నచ్చలేదు. ఒకటి – మీ పిల్లల్ని ఎంగేజ్ చెయ్యడమేమిటి? వాళ్లతో కాసేపు సరదాగా గడపాలనుకుంటున్నాను. ఇటీజ్ నాట్ ప్రెషర్, ప్లెజర్! రెండు – పూరీ టిఫిన్. మనమిక్కడ సరదాగా కుర్చుని కబుర్లు చెప్పుకోవాలి కానీ, వంటల్లో టైం గడిపెయ్యకూడదు. ఏ ఉప్మాయో ఐతే ఇట్టే ఐపోతుంది కానీ, పూరీలెందుకు పెట్టుకున్నారు?'' అన్నాడు నిష్టూరంగా.

''నేను శ్రీమతికి చెప్పాను – నువ్వు పూరీలు చెయ్యడంలో ఎక్స్‌పర్ట్‌వని. ఐనా తను కూడా పూరీలే ప్లాన్ చేసింది. నీతో పోటీ పడాలని కాదు. నీకవి ఎక్కువిష్టమని!'' అన్నాను.

దేవ్‌దార్ వెంటనే, ''పూరీలకి మా కూరకంటే, మీ తెలుగువాళ్ల కూరే నాకెక్కువిష్టం. నేనన్నది పడుతున్న కష్టం గురించి....''

''నువ్వు పిల్లల్ని చూస్తూండు. మేము పూరీలు చేస్తూంటాం. నీది కష్టమైతే మాదీ కష్టం. ఇష్టమైతే మాదీ ఇష్టం'' అన్నాను.

దేవ్‌దార్ నవ్వి, ''విదేశాల్లో కూడా ఇలా ఆలోచించడం, మన భారతీయులకే చెల్లిందేమో!'' అన్నాడు.

ఆ మాట నిజం.

ల్యూనబర్గులో నటరాజన్, రామచంద్ర, దేవ్‌దార్ వగైరాల ఇళ్లలో నేను పొందిన ఆతిథ్యం గుర్తుకొచ్చి మనసు ఆర్ద్రమైంది.

వంటింట్లోకి వెళ్లేసరికి శ్రీమతి – కలిపిన పూరీ పిండిని ఉండలుగా చేస్తోంది. పిల్లలిద్దరూ మేమూ ఉండలు చేస్తామని మారాం చేస్తున్నారు.

నేను వాళ్లతో, ''అంకుల్ మీకు కథలు చెబుతారుట. రమ్మంటున్నారు'' అన్నాను.

ఇద్దరూ బిక్కమొహం వేశారు. ''నాకిప్పుడు కథలు వినాలని లేదు'' అంది పాప.

''తాత్తూయాను (నాక్కూడాను)'' అన్నాడు బాబు వెంటనే.

''అతడికి తెలుగు రాదు. వీళ్లకి ఇంగ్లీషు, హిందీ రాదు. ఏ భాషలో మాట్లాడుకుంటారు? వీళ్లనిక్కడే ఉండనివ్వండి'' అంది శ్రీమతి.

''మేము ఉండలు చెయ్యం. అమ్మని చుస్తూ నిలబడతాం. ఇక్కడే ఉంటాం'' అంది పాప.

''నేను తూదా (కూడా)'' అన్నాడు బాబు వెంటనే.

‘‘అలాగనకూడదు. అంకుల్ మిమ్మల్ని చూసి ముచ్చట పడుతున్నారు. మీకు బోలెడు పాటలొచ్చని ఆయనకి తెలియదు. అందుకే కథలు చెబుతానన్నారు. ఒక్కసారి వెళ్లండి. మీరాయన కథలు కాదు. ఆయన మీ పాటలు వింటారు. ఒక్క నిముషం చూడండి. అలా జరక్కపోతే ఇక్కడికొచ్చెయ్యండి’’ అన్నాను.

పాపకి నిజంగానే చాలా పాటలొచ్చు. తెలుగువాళ్ల వద్ద తెలుగువి, హిందీవాళ్ల వద్ద హిందీవి పాడుతుంది.

పూర్తి లిరిక్సుతో పాడ్డం తన వయసుకి పెద్ద విశేషం. అప్పటికి అలా చాలామంది మెప్పు పొందింది.

ఆ మెప్పు ఇచ్చే కిక్కుకోసం అడిగిందే తడవుగా పాట పాడి వినిపిస్తుంది.

నా ట్రిక్కు పని చేసింది. అది ‘‘సరే’’ అంటే, బాబు కూడా ‘‘సయే’’ అని దాన్ని అనుసరించాడు.

వాళ్లిద్దర్నీ దేవ్‌దార్ వద్ద వదిలి, శ్రీమతికి సాయం వెళ్లాను.

పూరీలు వేస్తుంటే ఎందుకో నూనె పొంగి కార్పెట్‌మీద పడింది.

శ్రీమతి వెంటనే స్టవ్ వేడి తగ్గించి, నన్ను బూరెలమూకుడు దగ్గర నిలబడమంది.

తనేమో వంగి వేడి వేడి ఆ నూనె ప్రభావం కార్పెట్‌ని దాటి చెక్క నేలమీద కూడా పడిందేమోనని కార్పెట్ కొంచెం తొలగించి చూస్తూ, ‘‘చెక్కకేమీ ఐనట్లు లేదు’’ అంది.

ఈలోగా స్టవ్ ఇంకా వేడిమీదుందేమో, నూనె మళ్లీ పొంగేలా కనబడింది. నేను కంగారు పడి పట్టకారుతో బూరెల మూకుణ్ణి పట్టుకుని పైకి లేపాను. నూనె సెగ అరచేతికి తగిలి కొంచెం మండింది. వంటగట్టుమీద పెడదామంటే – అక్కడ సరంజామా అంతా పరిచి ఉంది. ఎక్కడా చోటు లేదు.

ఇండియాలో అలవాట్లు ఎక్కిడికి పోతాయి?

చటుక్కున బూరెల మూకుణ్ణి కార్పెట్ ఎత్తిన చెక్కనేలమీద పెట్టేశాను.

‘‘ఏంటి మీరు చేసింది?’’ అంటూ శ్రీమతి తన చీర కొంగుని మడతలు పెట్టి కాస్త దట్టం చేసి, దాంతో మూకుణ్ణి ఎత్తి పట్టుకుని స్టవ్‌మీద పెట్టి స్టవ్ కట్టేసింది.

జరిగింది గ్రహించగానే, ఒక్కసారిగా గుండె గుభేల్మంది.

ఇలాంటి విషయాల్లో జర్మనీలో ఇంటిని ఎంత జాగ్రత్తగా చూసుకోవాలో, నా సీనియర్ కొలీగ్ కాంతారావు చెప్పిన జాగ్రత్తల్ని మర్చిపోయినందుకు నన్ను నేనే తిట్టుకోసాగాను.

నేను అప్సెట్టయ్యానని గ్రహించిందేమో, ‘‘కంగారు పడకండి. కార్పెట్‌మీద నూనె వలికిందంతే! అది కొంచెం డిటర్జెంటు వేసి క్లీన్ చేద్దాం. ఇక నేలమీద మీరు పెట్టిన బూరెల మూకుడుకి నేల కాలేదే కానీ, నేను వెంటనే తీసేసేగా! దాంతో నల్లటి మచ్చ పడిందంతే! గుడ్డతో తుడిచేస్తే పోతుంది. ఇకమీదట ఇలా జరక్కుండా ఎక్కువ జాగ్రత్తగా ఉందాం’’ అని శ్రీమతి నాకు కొంత ఉపశమనం కలిగించింది.

నాకింకా కాళ్లూ చేతులూ ఆడ్డం లేదు. ఈలోగా శ్రీమతి కార్పెట్‌ని ఆ కాస్తమేరా డిటర్జెంటుతో కడిగి నూనె జిడ్డుని వదిల్చింది. చెక్కనేలమీద గుడ్డతో తుడిచి నల్ల మచ్చ పోగొట్టింది.

తర్వాత నేను పూరీలొత్తి ఇస్తుంటే, తను చకచకా పూరీలు వేసింది.

ఒకటా రెండా ఏకంగా నలభైరెండు పూరీలు.

మామూలుగా మేము మనిషికి నాలుగుకంటే తినలేం. బయటి మనిషి అదనంగా ఒక్కరొచ్చినా సరే, శ్రీమతి గణాంకాలు మారిపోతాయి.

''వాళ్లు తింటానంటే వద్దనకూడదు. వద్దనేదాకా పెట్టాలి'' అన్నది ఆమె సిద్ధాంతం. అంటే ఇప్పుడు మేము ఒక్క దేవ్‌దార్ కోసం కనీసం ఇరవైఆరు పూరీలు అదనంగా వేశాం.

పనులయ్యేక, ఎందుకైనా మంచిదని, ఇంకోసారి కార్పెట్ ఎత్తి చూశాను. అక్కడ చాలా పెద్ద నల్ల మచ్చ కనిపించింది.

హడిలిపోయాను, ''నన్ను ఓదార్చడానికి మాయ మాటలు చెప్పావ్ కానీ, మచ్చ అలాగే ఉంది. నా జీవితానికే మాయని ఈ మచ్చ, ఇంత పెద్దదిగా ఉండడం చాలా బాధగా ఉంది. ఏమైతే అయింది – జరిగింది ఒలోముచ్‌కీకి చెప్పేస్తాను. తనే శిక్ష విధించినా భరిస్తాను'' అన్నాను.

''మహానుభావా! మీరు చేసిన మచ్చ నిజంగానే పోయింది. ఇప్పుడు మీరు చూసిన ఆ మచ్చ పాతది. కార్పెట్ మొత్తం ఎత్తి చూడండి. నేలమీద నల్లని మచ్చలు ఆరేడు దాకా ఉన్నాయి. వాటిని – మనకి ముందున్నవారు చేశారో లేక ఒలోముచ్‌కీయే చేసిందో, ఆ దేవుడికే ఎరుక! ఆ మచ్చలు చూసేక నాలో అపరాధభావం పోవడమే కాదు, ధైర్యం కూడా వచ్చింది. అలాగని ఈ రోజు నేర్చుకున్న పాఠం మాత్రం మర్చిపోన్లెండి. ఈ నూనె ఎందుకు పొంగిందో, మళ్లీ పొంగకుండా ఏంచెయ్యాలో అధ్యయనం చేస్తాను. ఆఫీసులో మీరు, ఇంట్లో నేను – రీసెర్చి అన్న మాట!'' అంది శ్రీమతి వాతావరణాన్ని తేలిక చేస్తూ.

తర్వాత శ్రీమతి రీసెర్చిలో బయటపడిందేమిటంటే – కాస్త చవగ్గా ఉందని మేము కొన్న కొత్త నూనెకి ఇలా పొంగే గుణముంది. దాన్ని పూరీలు, గారెలు వగైరా వేయించే వంటకాలకి వాడకూడదు. కూరలకి, పోపులకి, ఊరగాయలకి వాడుకోవచ్చు.

ఏదేమైతేనేం, అనుకున్నకంటే పూరీలకి కాస్త ఎక్కువ టైం పట్టింది. అవతల పిల్లలు దేవ్‌దార్‌కి ఎంత బోరు కొట్టిస్తున్నారోనని కలవరపడుతూ – మా బెడ్రూం కమ్ డ్రాయింగ్ రూంకి వెళ్లాం.

అక్కడ మేము చూసిన సన్నివేశం మా ఊహకందనిది....

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments